కథ

# ఊర్మిళ

-సింగరాజు నాగలక్ష్మి

**విదేహ రాజ్యం** - మిథిలా నగరం - జనక మహారాజు గారి అంతఃపురం - అవధిలేని ఆనందంతో ఊసులాడుకుంటున్న చూడ చక్కని కన్నెపిల్లలతో వెలిగిపోతూ ఉంది. ఎటుచూసినా అత్యద్భుత సౌందర్యం- ఎటు తిరిగినా అవధిలేని ఆనందం. ఈడొచ్చిన కన్యలు నడయాడుతున్న ఇల్లు-వెలుగుల పందిరి కాదూ ?

జనక మహారాజు అనుంగు కుమార్తెలు సీత, ఊర్మిళ. వారితో బాటు రాజుగారి తమ్ముడు కుశధ్వజుడి ప్రియపుత్రికలు మాండలీ, శృతకీర్తి. మరెందరో వీరి చెలికత్తెలతో నిండుగా ఉంది అంతఃపురం. నగరంలో జరుగుతన్న యజ్ఞంలో పెద్దలు హడావుడిగా ఉంటే నలుగురూ కలసిన ఆనందంలో పిల్లలున్నారు.

రాకుమార్తెలూ, వారి చెలికత్తెల సంభాషణలో వచ్చింది నగరానికి విశ్వామిత్రుల వారి రాక, ఆ మునీశ్వరునిలో వచ్చిన ఇరువురు రాకుమారుల విషయం.

"సూర్యచంద్రుల్లా ఉండి మా మిథిలా నగరాన్ని వెలుగులలో ముంచెత్తుతున్నారీ యువకులు'' అన్నారుటమ్మా మహారాజుగారు '' అన్నదో చెలికత్తె.

"వారు మనవద్దనున్న శివధనుస్సు చూడగోరి వచ్చారుట''

"ఇంకేముందీ వారికా శివధనుస్సు చూపడంలో జాగు సేయరు మహారాజువారు''

"ఇద్దరిలో ఎవరు విల్లు ఎక్కుపెడితే వారికి మన సీతాసుందరితో వివాహం జరిపిస్తానని కూడా చెప్పారుట మహారాజుగారు నిన్న సాయం సంధ్యా సమయంలో''.

''అయితే ఇంకేం ! త్వరలో మన సీతమ్మ పెళ్లికూతురవుతుంది ... '' చెలికత్తె ఒకతె సీత బుగ్గ పుణికి ముద్దు పెట్టుకుంది. క్షణకాలం బుగ్గలు ఎరుపెక్కినా మరుక్షణం సీతాదేవి మామూలుగా అయిపోయి "చూద్దాం .... చూద్దాం....... వారు అంతపని చేసినప్పుడూ'' అంది నిరాసక్తత ప్రదర్శిస్తూ.

> **"సూర్యచంద్రుల్లా ఉండి మా మిథిలా నగరాన్ని వెలుగులలో ముంచెత్తుతున్నారీ యువకులు" అన్నారుటమ్మా మహారాజుగారు" అన్నదో చెలికత్తె.**

ఆ సమూహంలోనే ఉంది సీత సోదరి ఊర్మిళ. ఆ రాకుమారులిద్దరి గురించి చెప్పుకుంటున్న మాటలు వింటూనే ఉంది. పై పెచ్చు క్రిందటి రోజు శకానందుల వారి వెంట విశ్వామిత్రుడూ, రామలక్ష్మణులూ మహారాజు సదనానికి వెళ్తున్నప్పుడు అంతఃపుర గవాక్షంలోంచి చూసింది కూడా వారిని. నిజం చెప్పొద్దూ ! అప్పటి నుంచి ఒక ఆశ, నమ్మకం ఆమెలో కలిగాయి. ఆ యువకులిద్దరిలో నల్లనివాడు శివుని విల్లు ఎక్కుపెడతాడనీ అక్కచేత వరమాల మెళ్లో వేయించుకుంటాడనీను. సరే ! అక్క అతగాడిని వరిస్తే ..... రూపురేఖల్లో అన్నగారిని పోలిఉండి, చక్కని మేని ఛాయతో చంద్రునిలా మెరిసిపోతున్న రెండవ యువకుడు ... ఆ రెండో యువకుడు తన్ని వరిస్తే ...... అబ్బా ! ఊహకే ఉక్కిరి బిక్కిరి అయింది ఊర్మిళ. చెలులంతా సీత వెంటే ఉన్నారు. అంతమందిలో ఉన్నా మదినిండా లక్ష్మణ కుమారుని నింపుకున్న ఊర్మిళ ఏవేవో ఊహల్లో తేలిపోవడం ఎవరూ గమనించలేదు.

స్వభావతః ముభావి అవసరం అయితే అతి క్లుప్తంగా మాట్లాడి ముగించే ఊర్మిళ చెలులెవరికీ అర్థం కాదు. అసలు క్రితం రోజు నుంచే ఊర్మిళ ఆ తలపుల్లో తలమునక లవుతున్నది. అందగాడు, సుందరుడూ అయిన ఆ లక్ష్మణ దేవరని తన మనసనే పూపొదరింట సుఖాసీనుని చేసింది. వలపుల తలపుల్లో పులకరించి పోతున్నది. సరిగ్గా అదే సమయంలో .... అంతఃపుర కాంతలు ఈ ప్రసక్తి తీసుకు

> **నిజంగా వారిద్దరూ సూర్యచంద్రుల్లాగానే ఉన్నారు. మిథిలా నగరం మాటేమో గానీ ఆ చంద్రుడు మాత్రం తన కళ్లు మెరిపించాడు. మనస్సు మురిపిస్తున్నాడు.**

రావటంతో ఊర్మిళ బుగ్గల్లోకి వెచ్చటి ఆవిరి వచ్చింది. మేనంతా చిరుచెమట క్రమ్మింది. కళ్లు బరువుగా వాలిపోయాయి. సఖుల మధ్య కూర్చోలేక అక్కడనుంచి లేచివచ్చి ఏకాంతంగా కూర్చుంది గవాక్షం దగ్గర.

ఈ వీధినే గదా నిన్న వాళ్లిద్దరూ నడచి వెళ్లారు !! నాన్నగారికి అంత చక్కటి ఉపమ ఎలా తోచిందో గానీ నిజంగా వారిద్దరూ సూర్యచంద్రుల్లాగానే ఉన్నారు. మిథిలా నగరం మాటేమో గానీ ఆ చంద్రుడు మాత్రం తన కళ్లు మెరిపించాడు. మనస్సు మురిపిస్తున్నాడు. వారిని చూడగానే నాన్నగారి మనసు కూడా పొంగిపోయినట్టుంది. ఒక్కమాట కూడా అధికంగా పలుకని వారు కుతూహలం పట్టలేక "మహర్షీ ! మీ వెంట ఉన్న ఈ చిన్నారులు దేవతలతో సమాన పరాక్రమం గలవారు, వీరులు. గజ, సింహ, శార్దూల వృషభాలవలె గంభీర గమనులు, తామర రేకుల్లా విశాలమైన కన్నులు గలవారు, ఖడ్గములను, తూణీరములను, ధనుర్బాణాలను ధరించి ఉన్నవారు, అశ్వినీదేవతల వంటి స్ఫురద్రూపులు, యౌవనమున అడుగిడుతున్నవారు, దైవ వశమున దివి నుంచి దిగివచ్చిన దేవతల్లా కనపడుతున్న వాళ్లు, మీతో కాలినడకన ఎట్లా వచ్చారు ? అసలెందుకు వచ్చారు ? ప్రయాణంలో, మనోభావాల్లో, చేష్టల్లో ఒకరినొకరు పోలి ఉన్నారు. జులపాలతో చూడముచ్చటగా ఉన్న ఈ చిరంజీవులెవరో తెలిపి పుణ్యం కట్టుకోండి" అని అడిగారుట.

వెంటనే మహర్షి విశ్వామిత్రుల వారు వీరిర్వురూ దశరథ మహారాజు పుత్రులనీ, సిద్ధాశ్రమంలో రాక్షస సంహారం చేసి యజ్ఞాన్ని కాపాడారనీ, నిర్భయంగా అడవుల్లో ప్రయాణం చేసి అహల్యా శాప విమోచనం గావించి గౌతమ మునీశ్వరుని సేవలను స్వీకరించి, దివ్యశక్తి సంపన్నమైన శివధనుస్సును గురించి విని దాన్ని వీక్షించగోరి ఇక్కడికి వచ్చారనీ తెలిపారుట.

అదివిని నాన్నగారు ఎంతో ఆనందించారుట. బహుశా ఈ ఉదయమే వారికా ఇల్లు చూపుతారేమో. నాన్నగారు ఉదయమే శీఘ్రంగా నిత్యనైమిత్తిక కర్మలు ముగించుకొని విశ్వామిత్రుల వారి వద్దకు వెళ్లినట్టు తెలిసింది.

ఇలా ఊర్మిళ తన ఆలోచనలలో తానే లీనమై ఇవతల జరుగుతున్న వాటిని గమనించనేలేదు. కొంతసేపటికి చెలులు అక్కతో అంటున్న మాటలు చెవిన పడ్డాయి.

"విన్నావామ్మా సీతా ! లోకహితా ! మహారాజుగారి ఆదేశానుసారం కార్యదక్షులైన మంత్రులు చెప్పగా బలిష్ఠులైన ఐదువేలమంది పురుషులు గంధ పుష్పాలతో అలంకృతమై ఉన్న ఆ దివ్యధనుస్సును ఎనిమిది చక్రాల శకటంపై ఉంచి, ఆ ధనుఃపేటికను శ్రమపడుతూ విశ్వామిత్రుల వారి విడిది వద్దకు లాక్కుని వెళ్లారుట. తెలుసా ! ఇక శుభం ఆశిస్తూ ఉండు"

మనసులో మొదలైన అలజడిని చెలులు పసిగట్టకుండా తాపత్రయపడుతూ "అలాగా !" అంది సీతమ్మ ఏమాత్రం ఉత్సుకత ప్రదర్శించకుండా. ఆ యువకుల అందచందాలు, శౌర్య ప్రతాపాలు నిన్నటినుంచీ చెలుల నోట వింటూనే ఉన్నా ....... ఆ క్షణంలోనే సీతకు దానిమీద ఆలోచన కలిగింది. ఎందరెందరో మహా బలవంతులనే వారంతా ప్రయత్నించి భంగపడ్డారు. నాన్నగారు ఇంత మోజుపడుతున్న ఆ చిన్నవానిని విజయలక్ష్మి వరించెనా ....... ఆ వెనుక ఆ నీలమేఘశ్యాముడు తన్ను వరించేనా ? ఆశ ..... నిరాశల మధ్య ఉక్కిరి బిక్కిరౌతూ సీత మౌనం వహించింది.

నీలమేఘ శ్యాముడా రాముడు విల్లు ఎక్కుపెడితే అక్క అతగాడిని చేపడితే అక్క పెళ్ళి .... తర్వాత ..... తర్వాత ఊహకే సిగ్గుపడిపోయింది ఊర్మిళ. ఏదో మైమరపు. అంతలోనే రవ్వంత వెరపు. అక్క పెళ్లితో పాటు తన పెళ్లీ తలపెడతారా నాన్నగారు ? మిథిలాకాశం ప్రస్తుతం వెలిగిస్తున్న ఆ చంద్రుడు తన హృదయాకాశంలో కౌముది నింపుతాడా ...... ఏమో !

అక్కా చెల్లెళ్లు ఇద్దరిలోనూ ఉత్సుకత. సీత మనసులోని ఉత్కంఠ చెలులకి తెలుసు. ఎందుకంటే ఆమె వీర్యశుల్క. స్ఫురద్రూపియైనా, కురూపియైనా శివధనుస్సు ఎక్కు పెట్టగలిగిన వీరుడైతే చాలు ఆమెను పొందటానికి.

ఎంతోమంది అటువంటి ప్రయత్నం చేసి భంగపడ్డారు. ఇవన్నీ చూసి జనక మహారాజు ఆందోళన చెందుతున్నాడు కూడాను 'తన కుమార్తెకు తగిన వరుడు దొరికేనా' అని. అటువంటి సమయంలో ఈ అవకాశం రామచంద్రుడికి దొరికింది ... విధి అనుకూలించేనా ......... ?

అంతఃపురమంతా మౌనం అలుముకుంది. అందరికీ ఆతృతతో ఆందోళన పెరుగుతోంది. మాండలీ, శ్రుతకీర్తులకీ వాతావరణం అర్థం కావడం లేదు. వింతగా, కొత్తగా తోస్తున్నది. నిమిషం ఒక యుగంలా ఉంది సీతకి. చెలులంతా సీత వెంటే ఉన్నారు. ఊర్మిళలోని ఉద్వేగానికి ప్రకటన లేదు. ఏకాంతంలోనే ఆ కాంత ఉత్సుకత అణచుకుంటూ నిరీక్షిస్తోంది. మనసు మాత్రం జరగబోయేది శుభమేనని సూచిస్తోంది.

ఆ మౌనాన్ని ఛేదిస్తూ వినపడిందొక ధ్వని పిడుగు పాటులా ఎంతో భయానకంగా జనులని విహ్వలుగా చేస్తూ. అంతఃపురంలో సఖీజనమంతా మూర్ఛిల్లారు. క్షణకాలంలో తేరుకుంది సీతా భామిని. పెదవులపై చిరుదరహాసం అవతరించింది. బుగ్గల్లోకి ఎర్రని సిగ్గుపాకి వచ్చింది. విశాల నయనాలు వినయంతో వాలిపోయాయి. జరిగింది ఏమిటో ఆమెకి అర్థం అయిపోయింది. ఆ నల్లని మేని నగుమోవి చిన్నవాడు శివధనుర్భంగం చేశాడు. తనని వరించే విలుకాడు గురువుగారితో పాటు తన తండ్రి సన్నిధిలో నిలచి ఉన్నాడు. తన కలా, తండ్రి కలా ఫలించాయి !!

త్వరగానే తేరుకుంది అంతఃపురం. ఇంతలో వర్తమానం రానే వచ్చింది శుభాన్ని తెలుపుతూ. మహారాజు గారు సీతను తీసుకురమ్మని కబురు పంపారు. సఖులంతా ఆమెని తీసుకెళ్లే ప్రయత్నంలో మునిగారు. ఊర్మిళ చిన్నగా నిట్టూర్చింది. 'హమ్మయ్య' ! అనుకుంది మనసులో. బావగారు దొరికారు. అక్క అదృష్టవంతురాలు. ఇక నాన్నగారికి తన గురించి ఆలోచన రావాలి కదా ! ఆశ అధికమై ఆలోచనలు ఒకచోట నిలువనివ్వటం లేదు. అక్కడినుంచీ లేచి వెళ్లింది శయనాగారం లోకి.

అలా ఎంతసేపు అయిందో తెలియదు. "ఊర్మిళా దేవీ ! తీరిగ్గా శయనించావా ? రా అమ్మా ! నాన్నగారు పిలుస్తున్నారు" అంటూ వచ్చిందో చెలికత్తె వెదుక్కుంటూ. "అక్కడ నీ పెళ్లి ముచ్చట్లు సాగుతుంటే నీవిక్కడ నక్కి కూర్చున్నావా రాకుమారీ - నల్లని అన్నగారి తెల్లని తమ్ముడు నిన్ను వరించి తరిస్తాడుట" నవ్వారు అంతాను.

"శతానందులవారూ, విశ్వామిత్రుల వారూ, దశరథ మహారాజుగారికి పంపబోయే వర్తమానం తయారు చేస్తున్నారుట"

**సీత మనసులోని ఉత్కంఠ చెలులకి తెలుసు. ఎందుకంటే ఆమె వీర్యశుల్క. సుందరరూపియైనా, కురూపియైనా శివధనస్సు ఎక్కు పెట్టగలిగిన వీరుడైతే చాలు ఆమెను పొందటానికి.**

"తల్లీ ! ఊర్మిళా ! నువ్వు కూడా అక్కలా అదృష్టవంతురాలివి తల్లీ ! కోసలాధీశునికి మీ ఇద్దరూ కోడళ్లుగా వెళ్తున్నారు"

చెలికత్తెలు, అంతఃపుర దాసీలు త్వరపెడుతుంటే తీరబోయే కోరికల తలపులు సిగ్గులు చేస్తుంటే తడబడుతున్న అడుగులతో గజగమనయై వచ్చి తండ్రి సరసన నిల్చింది ఊర్మిళ. జనక మహారాజుకి నోట మాట రావటం లేదు. కూతురి తలమీద చెయ్యి ఉంచి గద్గద స్వరంతో దీవించాడు. ఎదురుగా గురు సమక్షంలో ఇద్దరు వరులు తండ్రికి మరోప్రక్కన అక్క.

ఊర్మిళ ఆనందానికి అవధులు లేకపోయాయి. ఎదురుచూసిన మధుర క్షణాలు వచ్చేశాయి. లక్ష్మణుని చెయ్యిపట్టుకుని అత్తవారింటికి, అయోధ్యా నగరానికి వచ్చింది ఊర్మిళ. అక్క చెల్లెండ్రు నలుగురూ తోడికోడళ్లైనారు. రూపసుందరులైన అన్నదమ్ములకి అతిలోక రమణులై భాసించారు. ఎటు చూసినా ఉత్సాహమే, ఎటు తిరిగినా ఆహ్లాదమే.

నిన్నంతా అయోధ్యానగరం మరీ సంబరంగా ఉంది. బావగారు శ్రీరామచంద్రుల వారికి పట్టాభిషేకం తలపెట్టారు మామగారు ! దశరథమహారాజుగారు మరి ఈ రోజు ఏమిటో! ఎక్కడ చూసినా నీరవత అలముకున్నది రాజ్యంలో. విషయం స్పష్టం కాలేదు గానీ ఏదో అనర్థమే సంభవించినదని మనస్సు శంకిస్తోంది. ఊర్మిళ ఆరాటంగా అటూ ఇటూ తిరుగుతూ ఉండగానే తెలిసింది. చిన్న అత్తగారు భరతుని తల్లి కైకేయీ దేవి రాములవారిని వనాలకి పంపమనీ, అతడి స్థానంలో భరతుల వారికి పట్టం కట్టమనీ మహారాజుగారిని వరాలు అడిగిందనీ. అది విన్న మహారాజుగారు మొదలు నరికిన చెట్టులా కూలిపోయారనీను. అబ్బా ! అంతటి మహారాజులకి ఎంతటి సంకటం దాపురించిందీ !

తండ్రిగారి సత్యవ్రతానికి భంగం కలగకూడదని బావగారు కానలకేగడానికి సిద్ధపడుతున్నారట. అక్కకూడా పతితో కలసి వెళ్తుందంటున్నారు. పాపం అక్కా, బావలకి ఊహించని ఉపద్రవం ఇది.

ఊర్మిళాదేవి ఆలోచనలకి భంగం కలిగిస్తూ ద్వారం తెరుచుకొని వేళగానివేళ లక్ష్మణస్వామి వేంచేశారు. ఉలికిపడుతూ లేచి నిలిచింది ఊర్మిళ. "ప్రాణప్రియా ! నేను అన్నా వదినెలతో కలసి అరణ్యవాసానికి బయల్దేరుతున్నాను. తల్లుల నీడలో నీకు ఏ వెరపూ లేకుండా కాలం గడుస్తుంది" అన్నారు క్లుప్తంగా. "స్వామీ! మిమ్మునేనూ అనుసరిస్తాను" ముగ్ధమౌనం వీడి పలికింది. "నే వెళ్లేది వారిని సేవించటానికే. నీ వనుసరిస్తే నా కర్తవ్య నిర్వహణ సరిగా సాగదు. కాబట్టి నీవిక్కడే నిలు" మరో మాటకి అవకాశం ఇవ్వకుండానే స్వామి నిష్క్రమించాడు.

నిరుత్తరయై నిస్తేజంగా నిలబడిపోయింది ఊర్మిళ. అక్క ఎంతటి ధన్య ! నగరమైనా, కాననమైనా నాథుడి తోడుగా ఉంటుంది. సీతా రాములంటే ఎవరు ? లక్ష్మీ నారాయణులే కదూ ! మరి తన స్వామి ! మూర్తీభవించిన భ్రాతృప్రేమ ! లోకంలో అంతా రాముల వారితో బాటు లక్ష్మణ స్వామిని తలచవలసినదే కదా ! సోదర సేవాసక్తి తన స్వామికి స్థిరకీర్తిని తెస్తుంది. మరి .... ప్రాణేశ్వరునికి కీర్తి కలగాలంటే ప్రియపత్నిగా తన కర్తవ్యం ఏమిటి ?

ఆలోచనలతో బాటు ఆచరించవలసిన ధర్మం గోచరించింది. భర్తకి సహకరించడమే తన ప్రస్తుత కర్తవ్యం. కానీ ఈ వియోగ దుఃఖం తను భరించగలదా .... ? భర్తృ వియోగం తను భరించలేదనీ ...... ఒంటరితనంతో శూన్యంలో జీవించడం తనకి రాదనీ దీనంగా చెప్పుకుంది నిద్రాదేవికి. 'నావారు వచ్చేదాకా నను వీడిపోకు' అని బేలగా ప్రార్థించింది నిద్రాదేవిని.

బిడ్డలోని ఆర్తికి కరిగిపోయే తల్లిలా ప్రేమగా ఊర్మిళను తన వళ్లోకి తీసుకుంది నిద్రాదేవి. ఎంతకాలం? పద్నాలుగు సుదీర్ఘ సంవత్సరాలు. వనవాసం చేసి, రావణుని ఓడించి, సీత చెర విడిపించి అన్నదమ్ములిద్దరూ అయోధ్య చేరటం, శ్రీరామచంద్రమూర్తికి పట్టాభిషేకం జరగడం ఆమెకి తెలియదు. వేడుకలు ముగించి లక్ష్మణుడు వచ్చి లేపే దాకా అలా నిద్రలోనే లీనమై ఉంది ఊర్మిళ.

రామాయణం చెప్పేటప్పుడు సీతమ్మ పాతివ్రత్యమే గొప్పగా వర్ణిస్తారు కానీ వలచి వరించిన పతి నెడబాసి ఆ ఎడబాటు తనని దహించి వేయకుండా నిద్రాదేవితో సంయోగంలో గడిపిన ఊర్మిళాదేవిని మనం మరచిపోవడం భావ్యం కాదు కదూ !

***

కవిత

# పంకజం

నీలగిరి వృక్షం నింగి కెగసినా
నేలపైకి తన సువాసనలను వెదజల్లుతుంది
గంధపు చెట్లకు చుట్టుకున్న మిన్నాగులను
విషపురుగులనూ లెక్కచేయక
సుగంధాలను విరజిమ్ముతుంది
వెన్నెలరేడు !
రమణీయ కమనీయ
వెన్నెలను విరజల్లుతుంటాడు
సూరీడు మారు పలుకక
తన వాడి వేడి వెచ్చని
కిరణాలందిస్తాడు సహజంగా
మరీ !
ప్రకృతిలోని అందచందాలను
ఆస్వాదించక, అసహజంగా
మనిషి !
అమానుషంగా ప్రవర్తిస్తాడేంటి అని
అనుకుంది "పంకజం"

- వెల్లుట్ల శ్రీనివాసరావు